సాక్షి
బాపట్ల

శనివారం, 10, ఫిబ్రవరి, 2024




గండాలయస్వామికి పూజలు

మంగళగిరి: పట్టణంలోని కొండపై వేంచేసి ఉన్న గండాలయస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శుక్రవారం అమావాస్య కావడంతో అధిక సంఖ్యలో విచ్చేశారు.



యార్డులో 1,23,756 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,23,756 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,10,077బస్తాల అమ్మకాలుజరిగాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 517.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి దీనీ ఇజ్‌తిమా ప్రార్థనలు

పెదకాకాని: రాష్ట్రస్థాయి దీనీ ఇజ్‌తిమా ప్రార్థనలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరు దాంగేనగర్ సమీపంలోని విశాల స్థలంలో రెండు రోజుల పాటు దీనీ ఇజ్‌తిమా నిర్వహణకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను మంగళగిరి డీఎస్పీ సీహెచ్.రవికాంత్ శుక్రవారం పరిశీలించారు. మత పెద్దలతో చర్చించారు. డీఎస్పీ వెంట పెదకాకాని సీఐ కొమ్మనబోయిన వీరాస్వామి తదితరులు ఉన్నారు.

ముద్దాయిలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



సత్తెనపల్లి: ముద్దాయిలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, గుంటూరు సీనియర్ సివిల్ జడ్జి లీలావతి అన్నారు. పట్టణంలోని సబ్ జైలును మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్, సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి డి.నాగవెంకటలక్ష్మీతో కలిసి శుక్రవారం సందర్శించారు. అక్కడ ఉన్న పరిసరాలను పరిశీలించారు. ముద్దాయిల వివరాలను తెలుసుకున్నారు. ఎవరైనా బాల నేరస్తులు ఉన్నారా అని కూడా ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి తౌషీద్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.డి.గౌస్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రియదర్శిని, సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

108లో డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్ : 108 అంబులెన్సులో డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత ఉన్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ నాగదీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, ఇంగ్లీషు చదవడం, రాయడం తెలిసి ఉండి, డ్రైవింగ్ హెవీలైసెన్సు కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు ప్రాంతాల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారు పని చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయం రెండో అంతస్తులోని 108 కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 9121892889 నంబరులో సంప్రదించాలని కోరారు.

గణాంక వ్యవస్థపై క్విజ్ పోటీలు



గుంటూరుఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం వివిధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు గణాంక వ్యవస్థపై క్విజ్ పోటీలను నిర్వహించారు. జాతీయ గణాంక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్.కిరణ్‌కుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లా ఉప ప్రాంతీయ కార్యాలయ గణాంక అధికారి డి.హనుమంతరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ముందుగా గణాంక వ్యవస్థ గురించి విద్యార్థులకు అవగాహన కలిప్పించారు. అనంతరం 'అధికారిక గణాంకాల వ్యవస్థ–ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు' అనే అంశంపై క్విజ్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మహిళా కళాశాల, అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాల, టీజేపీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో గణాంక శాఖ సహాయ డైరెక్టర్ శామ్యూల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

12న ఇన్‌స్పైర్ మానక్ ప్రదర్శన

గుంటూరుఎడ్యుకేషన్ : 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మానక్ ప్రదర్శనను ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు డీఈవో పి.శైలజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల జిల్లాలకు చెందిన 112 ప్రాజెక్టులను గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రదర్శనకు తీసురావాలని సూచించారు. ప్రదర్శనకు ఢిల్లీ నుంచి పరిశీలకులు వస్తున్నారని, సంబంధిత విద్యార్థులు ఏ కారణంతోనూ గైర్హాజరు కారాదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఏ.రవికుమార్‌ను 98496 27708 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

మహిళలకు ఆర్థిక సాధికారత



మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కరణం, సమన్వయకర్త వెంకటేష్

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి, సమన్వయకర్త వెంకటేష్
- వేటపాలెంలో ఆసరా నాలుగో విడత సంబరాలు

వేటపాలెం: మహిళల ఆర్థిక సాధికారత కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా అందిస్తున్నారని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే కరణం మాట్లాడుతూ చెప్పిన మాట ప్రకారం నాలుగు విడతల్లో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేసి, ఇచ్చిన హామీని అమలు చేశారని గుర్తుచేశారు. మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను అమలు చేసిన సీఎం దేశ చరిత్రలో జగన్ ఒక్కడేన్నారు. రాబోయే ఎన్నికల్లో నియోజవర్గ సమన్వయకర్త వెంకటేష్‌కు ఓట్లు వేసి గెలిపించి తిరిగి జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

అన్ని వర్గాలకు మేలుచేసిన ఏకైక సీఎం జగన్..

సమన్వయకర్త వెంకటేష్ మాట్లాడుతూ పేద వర్గాలుగా ఉన్న ప్రజల్ని నవరత్నాల సంక్షేమ పథకాలతో జగన్ లక్షాధికారుల్ని చేశారన్నారు. ప్రతి కుటుంబంలో పేదలకు దాదాపు రూ.2 నుంచి రూ.10 లక్షల వరకు సహాయం అందజేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఆసరా నాలుగో విడతలో వేటపాలెం మండల పరిధిలోని 1335 స్వయం సహాయక సంఘాలకు రూ.8.35 కోట్లు వారి బ్యాంకు ఖాతాలో జమ చేశారని తెలిపారు. మహిళలకు ఆసరా చెక్కులు అందజేశారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఎల్.శ్రీధర్, ఆర్‌బీకే చైర్మన్ పి.శ్రీనివారావు, సర్పంచ్ కందేటి రమణ, ఉపసర్పంచ్ డి.వెంకట సుబ్బారావు, జిల్లా వ్యవసాయ సలసహా మండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ చల్లా జనార్దన్, మాజీ సర్పంచ్ కట్టా గంగయ్య, జంగిలి రామారావు, అందె కృష్ణ, ఎ.అశోక్, బండి కళ్ల నరేష్, జిడుగు మస్తాన్, సాదు రాఘవ, దంతం హనుమంతరావు, కర్ణ లక్షారావు పాల్గొన్నారు.

'ఆసరా'తో మహిళలకు బాసట



వైఎస్సార్ ఆసరా చెక్కు అందిస్తున్న సమన్వయకర్త ఆమంచి

- పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి
- 865 గ్రూపులకు రూ. 7.65 కోట్ల చెక్కు పంపిణీ

కారంచేడు: మహిళా సాధికారతకు జగనన్న ప్రభుత్వం దేశంలోనే ప్రత్యేకతను సొంతం చేసుకుందని మాజీ ఎమ్మెల్యే, పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. మండల కేంద్రం కారంచేడు డాక్టర్ రామానాయుడు కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన 865 గ్రూపులకు చెందిన మహిళలకు రూ.7.65 కోట్ల ఆసరా చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమంచి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేస్తే, మన జగనన్న ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చారన్నారు. ఇచ్చిన మాట చొప్పున మహిళలకు వైఎస్సార్ ఆసరా ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రూ.46 వేల కోట్లను పంపిణీ చేశారన్నారు. నాలుగో విడతలో భాగంగా కారంచేడు మండలంలో రూ.7.65 కోట్లు మంజూరు చేశామన్నారు.

మళ్లీ జగనన్నను సీఎంగా చేసుకుందాం..

ఇదే రాజన్న రాజ్యం మళ్లీ మనం చూడాలంటే రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను గెలిపించుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద మహిళలకు అందిస్తున్న వైఎస్సార్ ఆసరా ద్వారా వచ్చిన డబ్బును సద్వినియోగం చేసుకుంటూ కుటుంబ పోషణకు తోడ్పాటుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతిపథం ఏరియా కో–ఆర్డినేటర్ లక్ష్మణాచారి, ఎంపీడీవో బీ బాబూరావు, ఏపీఎం మధుసూదనరావు, మండల పార్టీ కన్వీనర్ దండా చౌదరిబాబు, మండల జేసీఎస్ కన్వీనర్ యార్లగడ్డ శ్రీకాంత్, మండల కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్ అహ్మద్, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంతమాగులూరులో సభకు హాజరైన డ్వాక్రా మహిళలు

ఊసర వెల్లులను నమ్మొద్దు



చెక్కు అందజేస్తున్న సమన్వయకర్త చినహనిమిరెడ్డి

- నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- సంతమాగులూరులో ఆసరా చెక్కుల పంపిణీ

అద్దంకి (సంతమాగులూరు): సొంత అవసరాల కోసం పార్టీలు మారే ఊసరవెల్లుల వంటి నాయకులను నమ్మొద్దని స్థానిక ఎమ్మెల్యేని ఉద్దేశించి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి విమర్శించారు. వైఎస్సార్ వెలుగు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సంతమాగులూరులో నిర్వహించిన ఆసరా నాలుగో విడత సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభావేదిక వద్దకు వస్తున హనిమిరెడ్డికి డ్వాక్రా మహిళలు ఘన స్వాగతం పాలికారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోకుండా ఐదేళ్లకు ఒకసారి కనిపించే ప్రతిపక్ష ఎమ్మెల్యేను నమ్మొద్దని, ఓట్లు వేసి మోసపోవద్దని చెప్పారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అద్దంకి వచ్చిన తనకు ఓటు వేసి గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. సమస్యలకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే ప్రజల అభిమానాన్ని చూసి మైమరచిపోయానన్నారు. సంపాదన పక్కన పెట్టి ప్రజాసేవ కోసమే వచ్చానన్నారు. ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలుస్తాననే ధీమా ఏర్పడిందన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలి..

వైఎస్సార్ సీపీకి పెట్టని కోటగా ఉన్న అద్దంకి నియోజకవర్గంలో ఓ మోసకారి మాటలు నమ్మి ప్రజలు మోసపోయిన విషయం తెలుసునన్నారు. చెప్పిన మాట ప్రకారం డ్వాక్రా రుణమాఫీ చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేయాలన్నారు. చెప్పిన మాట నెరవేర్చడం కోసం ఆయన పడిన శ్రమ, కృషిని అందరూ గుర్తించాలన్నారు.

మళ్లీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, సీఎం జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం డ్వాక్రా మహిళలకు రూ.11 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. తొలుత సీఎం చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు.

కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చింత రామారావు, జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఇప్పల ముసలారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ బొల్లినేని రామకృష్ణ, ఓరుగంటి కోటిరెడ్డి, కారసాని కోటిరెడ్డి, నాగబోతు రామాంజనేయులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, డ్వాక్రా మహిళలు, సర్పంచ్‌లు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించాలి



విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న కలెక్టర్

- అధికారులు సామాజిక స్పృహతో విధులు నిర్వర్తించాలి
- వాడరేవులో గ్రామదర్శిని నిర్వహించిన కలెక్టర్ రంజిత్‌బాషా

చీరాలటౌన్: పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అందించే పథకాలు, సేవలు ప్రతి ఒక్కరికీ అందించడం అధికారుల బాధ్యతని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. గ్రామదర్శిని కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టర్ చీరాల మండలం వాడరేవు గ్రామంలో నిర్వహించారు. కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో కలిసి గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలు, వాడరేవు హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలు, వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాలు, జగనన్న కాలనీలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వాడరేవులో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు. హైస్కూల్‌లోని డిజిటల్ తరగతి గదిని, ఎంపీపీ స్కూల్లో చదువుతున్న విద్యార్థులకు కొద్దిసేపు విద్యాబోధన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులు సామాజిక స్పృహతో విధులు నిర్వర్తించాలన్నారు. గ్రామ స్వరాజ్యం దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రతి ఒక్కరికీ తాగునీరు, నివాస గృహం, సంపూర్ణ ఆరోగ్యం అందించడం, విద్య, మౌలిక వసతులు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందరికి అందించాలన్నారు. గ్రామాలన్నీ సుందరంగా ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, పర్యాటకంగా ముందున్న వాడరేవు గ్రామాభివృద్ధికి సమష్టిగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లల్లో అందించే విద్యాబోధనల వలన భావిభారత పౌరులను తీర్చిదిద్దాలన్నారు. వాడరేవు హైస్కూల్లో నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.

బోధనపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలి..

విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత లోపాలు లేకుండా పోషకాహారం అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు కూడా శ్రద్ధ తీసుకుని అందరికి ఆల్బెండజోల్ మాత్రలు అందించాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంతో స్కూల్ హెచ్‌ఎంకు మెమో ఇవ్వాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుని పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. గ్రామీణ వైద్య, ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. సచివాలయంలో కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు పెండింగ్‌లో ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గురు సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోకు చార్జ్ మెమో ఇవ్వాలని ఆదేశించారు. జగనన్న కాలనీలో నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని, నిర్మాణ పనులు పూర్తయిన వారికి త్వరగా బిల్లులు చెల్లించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి, డీఎంహెచ్‌వో విజయమ్మ, ఎంపీడీవో శోభారాణి, హౌసింగ్ డీఈ గోవిందరెడ్డి, ఏఈ శ్రీనివాసులు, విద్యుత్ ఏఈ బ్రహ్మం, రూరల్ ఎస్సై శివకుమార్ తదితరులు ఉన్నారు.

15న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాక



సభాస్థలిని పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే సుచరిత, ఎస్పీ తుషార్ దూడీ


సభాస్థలిని పరిశీలించిన తలశిల రఘురామ్

ఫిరంగిపురం: ఫిరంగిపురంలో ఈనెల 15న నిర్వహించ తలపెట్టిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, శాసనమండలి సభ్యుడు తలశిల రఘురామ్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డిలు రేపూడి గ్రామ శివారులోని పీఎన్‌సీ కళాశాల సమీపంలోని పొలాలను పరిశీలించారు, హెలీప్యాడ్ కోసం మార్నింగ్ స్టార్ కళాశాల స్టేడియంను, ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు, సభాస్థలి ప్రాంతంలో వేదిక, గ్యాలరీల నిర్మాణం, హెలీప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలను వారు పరిశీలించారు, ఆయాప్రదేశాలలో చేపట్టవలసిన భద్రతా చర్యలపై జిల్లా ఎస్పీ తుషార్ దూడీ, ఆర్డీవో పి.శేఖర్, ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించారు, వారివెంట ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, జేసీ రాజకుమారి, జెడ్పీటీసీ డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానరీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కొండవీడు ఉత్సవాలకు సర్వం సిద్ధం

హెలికాప్టర్ ట్రయల్ రన్ నిర్వహించిన అధికారులు

యడ్లపాడు: చారిత్రక, పర్యాటక కేంద్రం కొండవీడు ఫెస్ట్ –2024కు సర్వం సిద్ధమైంది. కోటపై ఏర్పాట్లను వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పుట్టకోట(కొత్తపాలెం) గ్రామం ప్రారంభంలోనే ఏడు ఎకరాల్లో పారా మోటరింగ్, హాట్ ఎయిర్ బెలూన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అన వేమారెడ్డి విగ్రహం పక్కనే కొండవీడుకోటలో సందర్శించదగ్గ ప్రదేశాలు, మ్యాప్ బోర్డు గ్యాలరీ ఉంది. వాటి ఎదురుగానే ఫ్లవర్‌షో, ఆంధ్రప్రదేశ్ చరిత్ర, దేశనాయకులు, అంబేడ్కర్ జీవిత విశేషాలు, స్వాతంత్ర్య పోరాట ఘట్టాల గ్యాలరీ సిద్ధం చేశారు. బెంగళూరు నుంచి తెప్పించిన ఎయిర్ బస్(హెలికాప్టర్)తో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా అధికారులతో ట్రయల్ రన్ నిర్వహించారు. 30 కి.మీ మేర కొండవీడు కోట, ఫిరంగిపురం, అమీనాబాద్ ప్రాంతాల మీదుగా చక్కెర్లు కొట్టడం జరుగుతుందన్నారు.



హెలికాప్టర్ వద్ద కలెక్టర్ శివశంకర్

ఆల్బెండజోల్ మాత్రలతో ఆరోగ్యం

డీఎంహెచ్‌వో విజయమ్మ

బల్లికురవ: విద్యార్థులను రక్తహీనత బారిన పడకుండా ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ఆల్బెండజోల్ మాత్రలు ఎంతో ఉపయోగపడతాయని బాపట్ల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి ఎస్. విజయమ్మ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని ఉప్పుమాగులూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేత ఆమె ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. సంవత్సరం నుంచి 2 ఏళ్లలోపు వారికి సగం మాత్ర, 2–19 సంవత్సరాల వయస్సువారికి ఒక మాత్ర, మధ్యాహ్నం భోజనం తిన్న తదుపరి జిల్లా వ్యాప్తంగా మింగించినట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో గర్భిణులకు సబ్ సెంటర్‌లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలో ఎప్పటికప్పుడు పరీక్షలతో ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిచ్చేందుకు వ్యాక్సిన్‌లు ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామ దర్శినిలో భాగంగా శుక్రవారం ఉప్పుమాగులూరు గ్రామంలోని సచివాలయ, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలను, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమాలో గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్, ఎంపీడీవో హనుమారెడ్డి, ఈవోఆర్డీ సుమతి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయశ్రీ, సెక్రటరీ సీహెచ్ వరప్రసాదరెడ్డి, పీఎంసీ చైర్మన్ కల్లి పద్మావతి, జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డీఎంహెచ్‌వో

ఎమర్జెన్సీ ల్యాండింగ్ ప్రదేశం పరిశీలన



మేదరమెట్ల: జాతీయ రహదారిపై బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని కొరిశపాడు–రేణంగివరం మధ్య ఏర్పాటు చేసిన విమానాల ఎమర్జెన్సీ ల్యాండింగ్ ప్రాంతాన్ని ఢిల్లీ ఎయిర్‌ఫోర్స్‌తో పాటు, ఎస్‌హెచ్ 16, రెవెన్యూ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జాతీయ రహదారిపై విమానాలను అత్యవసరంగా దించే కార్యక్రమాన్ని మార్చి నెలలో ప్రారంభిస్తారని.. అందుకే ఈ ప్రదేశాన్ని పరిశీలించేందుకు వచ్చినట్లు చెప్పారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కట్టడాలను, ల్యాండింగ్ విషయంలో కలిగే అసౌకర్యాలను వారు పరిశీలించారు. ల్యాండింగ్ ప్రాంతాన్ని పరిశీలించిన వారిలో ఢిల్లీ ఎయిర్స్ ఫోర్స్, ఎస్‌హెచ్ 16 అధికారులతోపాటు తహసీల్దార్ సుశీల ఉన్నారు.

భువనేశ్వరి సాక్షిగా గ్రూపుల పోరు

- తెనాలి శ్రావణ్‌కుమార్ మాకొద్దంటూ నినాదాలు
- రత్తయ్య వర్గం తిరుగు బావుటా

తాడికొండ: తాడికొండ మండల పరిధిలోని బండారుపల్లి గ్రామంలో 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా గురువారం పర్యటనకు వచ్చిన నారా భువనేశ్వరి ఎదుట టీడీపీ కార్యకర్తలు తెనాలి శ్రావణ్‌కుమార్‌పై ఫైర్ అయ్యారు. గ్రామంలో తూమాటి బాలయ్య మృతిచెందగా, ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు నారా భువనేశ్వరి గ్రామానికి వచ్చారు. అక్కడకు వచ్చిన తరువాత శ్రావణ్‌కుమార్ ఒక వర్గానికి ప్రాధాన్యం ఇచ్చి, మరో వర్గాన్ని దూరంగా ఉంచడంతో సీనియర్ నేత రత్తయ్య వర్గం డౌన్‌డౌన్ శ్రావణ్ అంటూ నినాదాలు చేస్తూ తిరగబడ్డారు. శ్రావణ్‌కుమార్ వెనుదిరిగి వెళ్లిపోయారు. గ్రామంలో రెండు వర్గాలుగా చేసి పార్టీకి డ్యామేజ్ చేస్తున్నారని, వర్గపోరును ప్రోత్సహిస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. శ్రావణ్ మాకొద్దు.. డౌన్.. డౌన్ శ్రావణ్ అంటూ బహిరంగంగానే నినాదాలు చేశారు. శ్రావణ్‌కుమార్ గోబ్యాక్ అంటూ కార్యకర్తలు నినాదాలు శ్రావణ్ వెనుదిరిగారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.5000, గరిష్ఠ ధర రూ.6200, మోడల్ ధర రూ.5600 వరకు పలికింది.



క్లుప్తంగా

అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్



చీరాల రూరల్: జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తన ప్రతిభను చాటి అంతర్జాతీయ అథ్లెటిక్స్‌కు ఎంపిక య్యారు. 5వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌ను ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్నారు. చీరాలకు చెందిన నాగరాజు రాష్ట్రం తరపున 40 ప్లస్ విభాగంలో పాల్గొని, శుక్రవారం జరిగిన షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. మెడల్‌తో పాటు సర్టిఫికెట్ అందుకున్నారు. ఉత్తమ ప్రతిభతో ఆకట్టుకున్న నాగరాజును మేలో ఆస్ట్రేలియాలో జరగనున్న అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ కు ఎంపిక చేశారు. ఒకవైపు పోలీసుగా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూనే మరోవైపు.. షాట్‌పుట్‌లో జాతీయస్థాయిలో రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింపజేసిన నాగరాజును సహచరులు అభినందించారు.

దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్‌గా మహేశ్వరరెడ్డి



గుంటూరు ఈస్ట్: దేవదాయ శాఖ మూడు జిల్లాల డెప్యూటీ కమిషనర్‌గా గొంతు మహేశ్వరరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. 1987లో ఈఓగా చేరిన ఆయన 2008లో అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై డెప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

అసిస్టెంట్ కమిషనర్‌గా అనుపమ



గుంటూరు ఈస్ట్: దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా మంతెన అనుపమ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కొల్లూరు గ్రూపు దేవాలయాల గ్రేడ్-1 ఈఓగా విధులు నిర్వహిస్తున్న ఆమె పదోన్నతిపై అసిస్టెంట్ కమిషనర్‌గా విధుల్లో చేరారు. అనుపమ 2007లో ఈఓగా చేరారు.

ఐబీ సిలబస్‌తో ప్రపంచస్థాయి విద్య

- విద్యార్థుల మేధో వికాసం, నైపుణ్యాభివృద్ధికి దోహదం
- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్
- గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సందర్శన



ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరం నుంచి ప్రవేశ పెడుతున్న ఇంటర్నేషనల్ బాకలారియేట్ (ఐబీ) సిలబస్‌తో పాఠశాలల స్వరూపం సమూలంగా మారిపోనుందని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ చెప్పారు. ఆయన శుక్రవారం గుంటూరు సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు తరగతుల నిర్వహణ, నాడు-నేడు ద్వారా పురోగతిలో ఉన్న టాయిలెట్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం సైన్స్ ప్రాక్టికల్స్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. అధ్యాపకులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రపంచ స్థాయిలో మేటి విద్యను అందించేందుకు తొలిసారిగా మన రాష్ట్రంలో ఐబీ సిలబస్‌ను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. అంతర్జాతీయస్థాయిలో ప్రఖ్యాతి చెందిన ఐబీ సిలబస్ ద్వారా విద్యార్థుల్లో మేధో వికాసం, వ్యక్తిగత అభివృద్ధి, భావోద్వేగాల్ని అదుపులో ఉంచుకోవడంతో పాటు సామాజిక నైపుణ్యాల్ని అలవర్చుకోవడంలో దోహదం చేస్తుందని వివరించారు. ప్రాక్టికల్, థియరీతో పాటు విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఐబీ సిలబస్‌లో విభిన్నమైన ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. ఇంటర్మీడియెట్ సైన్స్ విద్యార్థులకు ఆదివారం నుంచి ప్రారంభం కానున్న ప్రాక్టికల్స్‌ను సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధ్యాపకులకు సూచించారు. విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి కళాశాల్ని సుందరంగా తీర్చిదిద్దాలని అధికారుల్ని ఆదేశించారు. కళాశాల భవనానికి రంగులు వేయించి అహ్లాదకరంగా మార్చాలని సూచించారు. అనంతరం ఇదే కళాశాల పక్కన ఉన్న బాలికల వృత్తి విద్యా జూనియర్ కళాశాలకు వెళ్లిన, ప్రవీణ్ ప్రకాష్ విద్యార్థినులతో మాట్లాడారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని వారికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ రెండు కళాశాలల్లో వందలాది మంది విద్యార్థినులను చూసిన ప్రవీణ్ ప్రకాష్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం టెట్ ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు గుంటూరు రూరల్ చౌడవరంలోని ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దీంతో పాటు టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ కేంద్రం ఏర్పాటుపై పెదకాకానిలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి, ఆర్ఐవో జీకే జుబేర్, డీవీఈవో జె. పద్మ, డీఈవో పి.శైలజ, ప్రిన్సిపాల్స్ జి. సునీత, ఎన్. ఆనందబాబు ఉన్నారు.

19 నుంచి వైఎస్సార్ స్మారక నాటికల పోటీలు

గుదిబండి చినవెంకటరెడ్డికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం



వివరాలను వెల్లడించిన నిర్వాహకులు

తెనాలి: మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి స్మారక జాతీయస్థాయి తృతీయ ఆహ్వాన నాటికల పోటీలు ఈనెల 19వ తేదీనుంచి నాలుగు రోజులపాటు జరగనున్నాయి. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం, ప్రఖ్య చిల్డ్రన్ ఆర్ట్స్ థియేటర్ సంయుక్తంగా నిర్వహిస్తారు. ఆయా సంస్థల నిర్వాహకులు శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు జరిగే నాటికల పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల్నుంచి ఎంపిక చేసిన ఎనిమిది నాటికలను ప్రదర్శిస్తారు. పోటీల ప్రారంభం, ముగింపురోజు జరిగే సభల్లో రాష్ట్ర మంత్రులు పాల్గొంటారరు. వైఎస్.రాజశేఖరరెడ్డి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గుదిబండి చినవెంకటరెడ్డికి ప్రదానం చేస్తారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి అచీవ్‌మెంట్ పురస్కారాలను వైఎస్సార్ సీపీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ఉడుముల మహేష్‌రెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లక్కరాజు లక్ష్మణరావుకు ప్రదానం చేస్తారు. సమావేశంలో రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎం.సత్యనారాయణశెట్టి, ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, ప్రఖ్య చిల్డ్రన్ ఆర్ట్స్ థియేటర్ అధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, కార్యదర్శి అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో మేలు జాతి దూడలు

జిల్లా పశుగణాభివృద్ధి సంఘ కార్యనిర్వాహణాధికారి కాలేషా



దూడల యజమానులకు మందులు పంపిణీ చేస్తున్న అధికారులు

జే.పంగులూరు: కృతిమ గర్భధారణ ద్వారా జన్మించిన మేలు జాతి లేగ దూడలతో పాడి రైతులకు ఎంతో లాభం అని జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వాహణాధికారి డాక్టర్ కాలేషా అన్నారు. మండల పరిధిలోని రామకూరు గ్రామంలో శుక్రవారం కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. కాలేషా మాట్లాడుతూ ఈ లేగ దూడలను సంరక్షించుకుంటే.. పాడి గేదెలుగా నాలుగేళ్లకే తయారవుతాయని చెప్పారు. రైతులకు మంచి లాభాలు ఇస్తాయని తెలిపారు. అప్పుడే పుట్టిన దూడలకు రోజుకు 1.5 లీటర్లు నుంచి 2 లీటర్ల పాలు తాగిస్తే ఆరోగ్యంగా ఉంటాయన్నారు. దూడలకు నట్టల నివారణ మందు క్రమం తప్పకుండా నెలకోసారి.. మూడు నెలల పాటు తాపించాలని చెప్పారు. ప్రదర్శనలో పాల్గొన్న దూడల యజమానులకు బహుమతులు ప్రదానం చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ మురళి కృష్ణ, డీఎల్‌డీఏ పశువైద్యాధికారి డాక్టర్ కృపారావు, గోపాలమిత్రలు ఖాజాబాబు, వెంకట్రావు, శ్యామ్‌బాబు, రైతులు హాజరయ్యారు.

'గ్రామదర్శిని'లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విస్తృత పర్యటన



మార్టూరులో మధ్యాహ్న భోజన రికార్డులు పరిశీలిస్తున్న ఏఈ విద్యాసాగర్

మార్టూరు: గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీరు సీహెచ్ విద్యాసాగర్ శుక్రవారం మార్టూరులో పలు పథకాలను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మనబడి నాడు-నేడులో భాగంగా నిర్మించిన అదనపు తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. హెచ్ఈ పాఠశాలను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని సందర్శించి, సౌకర్యాలపై బాలికలను ప్రశ్నించారు. బలరాం కాలనీ సమీపంలోని హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీ కేంద్రాలు, గన్నవరం రోడ్డులోని జగనన్న లే అవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలను ఆయన సందర్శించారు. గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కె.సంధ్యశ్రీ, ఎంపీడీఓ జి.నితిన్, పంచాయతీ కార్యదర్శులు తన్నీరు శ్రీనివాసరావు, మీరావలి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ రవి అధికారులు పాల్గొన్నారు.

జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పనులు

డ్వామా పీడీ బి.అర్జునరావు

చినగంజాం: ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించే విషయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలని డ్వామా పీడీ బి.అర్జునరావు ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనుల సమాజిక తనిఖీ ప్రజా వేదిక శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల నిర్వహణలో అవకతవకలు జరిగితే సిబ్బందిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. మస్టర్లు తీసుకునే విషయంలో కూలీలకు శిక్షణ ఇచ్చి, సంతకాలు, వేలిముద్రలు పని సమయానికి ముందే తీసుకోవాలని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ శాఖ, సర్వశిక్ష అభియాన్, గ్రామీణ నీటిపారుదల శాఖ, ఉపాధిహామీ ఆధ్వర్యంలో మొత్తం 1,037 పనులకు సంబంధించి రూ.10.11 కోట్లు ఖర్చుపై తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ప్రజా వేదికలో గుర్తించిన లోపాలను తనిఖీ సిబ్బంది చదివి వినిపించారు. గ్రామాల్లో హాజరు తీసుకోవడంలో లోపాలను, మరికొన్ని గ్రామాలలో కూలీలు సంతకాలు, వేలిముద్రలు లేకుండా పనులు నిర్వహించారని గుర్తించారు. కడవకుదురు, పెదగంజాం, మున్నంవారిపాలెం తదితర గ్రామాల్లో ఈ లోపాలు తలెత్తినట్లు గుర్తించారు. గ్రామాల్లో నాటిన మొక్కలు పూర్తిగా ఎండిపోయి కనిపించకుండా పోయాయని, ఆయా ప్రాంతాల్లో తిరిగి మొక్కలు నాటించాలని పీడీ సిబ్బందిని ఆదేశించారు. ఉద్యాన శాఖకు సంబంధించి కడవకుదురు, పెదగంజాం గ్రామాల తోటల్లోని మొక్కలు పురుగులు పట్టాయని రైతులు సమస్యను పీడీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శోభన్ బాబు, ఎస్ఆర్పీ విజయభాస్కర్, ఎంపీడీఓ యూబీ వరప్రసాదరావు, ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి, ఆసోది బ్రహ్మానందరెడ్డి, ఏపీఓ గోలి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం

- ఈ నెల 11న ప్రారంభం
- జిల్లా వ్యాప్తంగా 113 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 24,910 మంది విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ద్వితీయ సంవత్సర సైన్స్ విద్యార్థులకు ఈనెల 11 నుంచి జరగనున్న ప్రాక్టికల్స్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాన్ జంబ్లింగ్ విధానంలో ఏ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అదే కళాశాలలో జరగనున్న ప్రాక్టికల్స్‌కు జిల్లావ్యాప్తంగా 113 కేంద్రాల్ని సిద్ధం చేశారు. ఎంపీసీ విభాగం నుంచి 21,817 మంది, బైపీసీ విభాగం నుంచి 3,093 మంది చొప్పున మొత్తం 24,910 మంది హాజరుకానున్నారు. గతేడాది వరకు ఓఎంఆర్, బార్ కోడింగ్ పద్ధతిలో మాన్యువల్‌గా చేసిన మార్కుల నమోదు విధానాన్ని బోర్డు ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంలోకి మార్చింది. రోజుకు రెండు విడతలుగా ప్రాక్టికల్స్ జరుగుతాయి. ఉదయం, మధ్యాహ్నం విడతలుగా వారీగా ప్రాక్టికల్స్ ముగిసిన వెంటనే పేపర్లను కరెక్షన్ చేసి, విద్యార్థుల మార్కుల్ని అక్కడిక్కడే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆర్ఐవో జీకే జుబేర్ ఆదేశించారు. దీనిపై ఇప్పటికే అధ్యాపకులకు ఓరియెంటేషన్ కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

ముద్రణ రంగంలో తెనాలికి ఖ్యాతి తెచ్చిన ఆలపాటి

ఆలపాటి-వెలగా పురస్కారాల ప్రదానోత్సవ సభలో ఆచార్య కృపాచారి



డాక్టర్ శారదకు ఆలపాటి రవీంద్రనాథ్ పురస్కారం



వెంపటి సత్యనారాయణకు వెలగా వెంకటప్పయ్య పురస్కారం

తెనాలి: అభ్యుదయ భావాలతో వివిధ పత్రికల్ని తెనాలి నుంచి ప్రారంభించి ముద్రణ రంగంలో ఖ్యాతిని తీసుకొచ్చిన ఆలపాటి రవీంద్రనాథ్ చిరస్మరణీయులని దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అన్నారు. పట్టణంలోని ఆలపాటి కళావతి రవీంద్ర పీఠం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయం హాలులో నిర్వహించిన ఆలపాటి రవీంద్రనాథ్ -కళావతి సంస్మరణ సభకు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఆచార్య కృపాచారి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, 1940 దశకంలో తెనాలి నుంచి జ్యోతి, రేరాణి, కినిమా వంటి ప్రసిద్ధ పత్రికల్ని నడిపిన రవీంద్రనాథ్, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ, శారద వంటి ఎందరో రచయితలను వెలుగులోకి తీసుకొచ్చినట్టు గుర్తుచేశారు. కుటుంబ నియంత్రణ గురించి మాట్లాడేందుకు భయపడే రోజుల్లో దాని ఆవశ్యకతపై తన పత్రికలో వ్యాసాన్ని ప్రచురించి, ప్రాసిక్యూషన్‌ను కూడా ఎదుర్కొన్న అభ్యుదయవాదిగా చెప్పారు. పట్టణానికి చెదిన డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారదను ఆలపాటి రవీంద్రనాథ్ పురస్కారంతో సత్కరించారు. ఇదే వేదికపై గ్రంథాలయ రంగంలో విశేషంగా కృషిచేసిన వెలగా వెంకటప్పయ్య పురస్కారంతో శ్రీషిర్డీ సాయి సేవాసమితి వ్యవస్థాపకుడు 'గానకళారత్న' వెంపటి సత్యనారాయణను సత్కరించారు. వెలగా జీవిత విశేషాలను పావులూరి శ్రీనివాసరావు వివరించారు. ఈఎల్‌వీ అప్పారావు స్వాగతం పలికిన సభలో ప్రముఖ పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం, మానవత సంస్థ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, యర్రంశెట్టి హనుమంతరావు, 'గీతాబంధు' గోలి లక్ష్మయ్యలు సత్కార గ్రహీతల విశిష్టతపై మాట్లాడారు. గ్రేడ్-1 లైబ్రేరియన్ కావూరి రమాదేవి వందన సమర్పణ చేశారు.

ఆడుదాం ఆంధ్రా తుది దశ పోటీలు ప్రారంభం



పోటీల్లో పాల్గొన్న వివిధ జిల్లాల జట్లు

విశాఖ స్పోర్ట్స్: గ్రామీణస్థాయి నుంచి యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా ప్రారంభించిన మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్రా' తుది ఘట్టానికి విశాఖ వేదికై ంది. నాలుగు దశల్లో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలకు విశేష స్పందన రాగా. జిల్లా స్థాయిలో సత్తా చాటిన జట్లతో రాష్ట్ర స్థాయి పోటీలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం విశాఖ రైల్వే స్టేడియంలో ప్రారంభించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, కలెక్టర్ మల్లికార్జున పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన 26 జిల్లాలకు చెందిన జట్ల చేత క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. తొలుత రైల్వే స్టేడియంలోని వేదిక వద్ద శాప్ పతాకాన్ని ఆ సంస్థ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, జాతీయ పతాకాన్ని మంత్రి రోజా ఆవిష్కరించగా అతిథులు గౌరవవందనం సమర్పించారు. పోటీలను ప్రారంభిస్తున్నట్టు మంత్రి ప్రకటించి గాల్లోకి బెలూన్లను విడిచారు. అనంతరం అతిథులు క్రీడాకారుల్ని పరిచయం చేసుకున్నారు. తొలిరోజు బ్యాడ్మింటన్ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన హశిత-రమ్య జోడీ 21-09, 21-11తో సత్యప్రియ-రోహిత జోడీపై విజయం సాధించి ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. ఈనెల 13వ తేదీ వరకు మహా సంగ్రామం జరగనుంది. 13న ముగింపు వేడుకలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్నారు.

ఖరీదైన బైక్‌లు దొంగిలించే

అంతర్ జిల్లా ముఠా అరెస్టు



వివరాలు తెలుపుతున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, పక్కన శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, ఏఎస్పీ, డీఎస్పీ

- రూ.24 లక్షలు విలువ చేసే 13 బైక్‌లు, 36 సెల్‌ఫోన్లు సీజ్
- వారం రోజుల్లో కేసుని ఛేదించిన నల్లపాడు పోలీసులు

నగరంపాలెం: ఖరీదైన బైక్‌లతో పాటు మొబైల్ దుకాణాల్లో చోరీలకు పాల్పడే దొంగల ముఠాను నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. రూ.24 లక్షల ఖరీదు చేసే 13 ద్విచక్ర వాహనాలు, 36 సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ వెల్లడించారు. వారం రోజుల కిందట గుంటూరు నల్లపాడు పీఎస్ పరిధిలోని పెద పలకలూరులో ఓ మొబైల్ దుకాణంలో చోరీ జరిగింది. ఈ క్రమంలో బాధితుని ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, ఏఎస్పీ (క్రైం), దక్షిణ డీఎస్పీ స్థాయిలో ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేసి, గాలింపు చర్యలు వేగవంతం చేశారు. గోరంట్ల చిల్లీస్ రోడ్ వద్ద శుక్రవారం ఉదయం గుంటూరు రూరల్ మండలం గోరంట్ల వాసి షేక్ అసిఫ్, పొన్నూరు మండలం ఎరుకుపాలేనికి చెందిన జాష్టి వెంకటసాయి, ప్రకాశం జిల్లా గిద్దలూరు ఐదో వార్డుకి చెందిన మైదకూరి హసీబ్, పొన్నూరు మండలం డీవీసీ కాలనీకి చెందిన దేవరకొండ రాజ్‌కుమార్ అలియాస్ భవాని, తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ అలీని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నేరం రుజువుకావడంతో అయిదుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేశారు. 13 ద్విచక్ర వాహనాలు, 36 సెల్‌ఫోన్లు, 10 చార్జర్లు, పవర్ బ్యాంక్స్ స్వాధీనం చేసుకున్నారు. మొబైల్ దుకాణంలో చోరీ కేసుని ఛేదించే క్రమంలో ఈ ముఠా చేస్తున్న చోరీలు ఒక్కొక్కటి వెలుగులోకి వచ్చాయి. గుంటూరు, ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోని కొన్ని పీఎస్‌లలో 14 కేసులు నమోదై ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు.

నగదు రివార్డులు అందజేత

కేసులో ప్రతిభ కనబరిచిన దక్షిణ డీఎస్పీ ఎండీ. మహబూబ్ బాషా, సీఐ సీహెచ్.రాంబాబు, ఎస్ఐ డి.అశోక్, హెచ్‌సీలు కె.సుబ్బారావు, పి.ఆదిబాబు, కానిస్టేబుళ్లు షేక్ జాన్‌సైదా, మస్తాన్ వలి, ఎ.చంద్రమౌళి, ఆర్.ఆంజనేయులను జిల్లా ఎస్పీ అభినందించి, నగదు రివార్డులు అందించారు. సమావేశంలో శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

డిజిటల్ టెక్నాలజీదే కీలకపాత్ర

వీసీ ఆచార్య పి. రాజశేఖర్



సదస్సు ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అనేక మార్పుల్లో డిజిటల్ టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తోందని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ సైకాలజీ విభాగం, గుంటూరు స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సును శుక్రవారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ డిజిటల్ టెక్నాలజీ యువతపై అధిక ప్రభావం చూపిస్తోందని, దాన్ని అవసరం మేరకు ఉపయోగించుకుంటే ఎంతో అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. డైరెక్టర్ , విభాగాధిపతి డాక్టర్ నాగరాజు సదస్సు నిర్వహణ ఉద్దేశాన్ని వివరించారు. స్పందన ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఈదా శామ్యూల్ రెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీని మంచి ఆలోచనల దిశగా మలచుకోవాలని సూచించారు. సైకాలజిస్ట్ డాక్టర్ అయోధ్య ఆర్. కె. కీలకోపన్యాసం చేశారు. డిజిటల్ టెక్నాలజీ నేటి రోజుల్లో వ్యసనంగా మారిందని, డ్రగ్స్ కంటే వేగంగా మనిషి మెదడును ఇబ్బందులకు గురి చేస్తుందని తెలిపారు. దాన్ని నివారించకపోతే మనిషి మనుగడకు పెద్ద ప్రమాదం సంభవిస్తుందని చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. గంగాధరరావు, అంతర్జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎం. వసంతరావు, సౌత్ ఆఫ్రికా, ఉగాండా, అమెరికా, బంగ్లాదేశ్, పాలస్తీనా, కోస్టారిక, ఆఫ్రికా, ఆఫ్ఘనిస్థాన్, దేశాల నుంచి 15 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.